క్లుప్తంగా

నేడు ఆంజనేయస్వామి తిరునాల

సుండుపల్లె : మండల కేంద్రంలోని తిమ్మసముద్రం గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి తిరునాల మహోత్సవాన్ని భక్తులు బుధవారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పూజారులు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, అనంతరం ధ్వజారోహణ, అభిషేకం, నవగ్రహ పూజలు చేసి తీర్థప్రసాదాల కార్యక్రమాలు నిర్వహించి కుంకుమార్చనలు, ఆకుపూజ, లంక పేర్చుట, రాత్రికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో చాందినీబండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా జరుగుతుందని తెలియజేశారు. మండలంలోని ప్రజలందరూ స్వామి వారిని దర్శించుకోవాలని తెలియజేశారు.

13 వరకు ఆధార్ క్యాంపు

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1లో 13వ తేదీ వరకు ఏర్పాటు చేసిన స్పెషల్ ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి పేర్కొన్నారు. ఈ ఆధార్ క్యాంపులో కొత్త ఆధార్ కార్డులు తీసుకోవడం ఆధార్ కార్డులో పేర్లు, పుట్టిన తేదీ మార్పులను అప్‌డేట్ చేసుకోవడం లాంటివి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15 నుంచి గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ కేసీఎస్‌టీ సముద్రం ఎస్టీ కాలనీలో ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ధర్తీ అబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. ఎస్టీలకు కొత్త ఆధార్ కార్డు, రేషన్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, పీఎం కిసాన్ జన్‌ధన్ యోజన బ్యాంకు అకౌంట్, హెల్త్ కార్డు లేని వారికి ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలో ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. కావున ఎస్టీ కాలనీ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి



నేరస్తులకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్‌ఐ

నందలూరు : పాత ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలియజేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లోని నేరస్తులకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పాత ముద్దాయిలు భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకూడదని తెలిపారు. ఇటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినశిక్షలు తప్పవని హెచ్చరించారు.

ఉన్నత అవకాశాలకు ఇంగ్లిష్ తప్పనిసరి



వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న నిర్వాహకులు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఇంగ్లిష్ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. మంగళవారం అనుదీప్ డ్రీమర్ అకాడమీ మూడవ వార్షికోత్సవ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో కోడూరు విద్యార్థులకు నాణ్యమైన తర్ఫీదు ఇవ్వడం శుభ పరిణామమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత అవకాశాలు పొందాలంటే ఇంగ్లిష్‌లో ఎంతగానో అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, హరికృష్ణారెడ్డి, డీవీ రమణ, రత్తయ్య, క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజ, రఘు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో దుష్పరిణామాలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో కిశోర వికాసం వేసవి శిక్షణా శిబిరాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక బాలసదన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ దాద్‌బి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాల నివారణ గురించి కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బడిలో చేర్పించాలంటూ ఇంటింటి ప్రచారం

సిద్దవటం : ప్రభుత్వ పాఠశాలతో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయవచ్చునని హెచ్‌ఎం అశ్వర్థరెడ్డి తెలిపారు. మాధవరం-1 పంచాయతీ మహబూబ్‌నగర్, వెంకటేశ్వరాపురం గ్రామాల్లోని పిల్లలను ప్రభుత్వ బడిలో చేరించాలని ఇంటింటా తిరిగి పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతమ్మ, రామకేశవ, శివప్రసాద్, సి.వి.సుధాకర్, ప్రసాద్, పాఠశాల చైర్మన్ బండి ఓబులేస్ క్రిష్ణయ్యలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తో కువైట్ వైఎస్సార్‌సీపీ నేతల భేటీ

రాజంపేట : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కువైట్ వైఎస్సార్‌సీపీ నేతలు భేటీ అయ్యారు. తాడేపల్లిలో ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలసి బొకేలను అందజేశారు. శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ విషయాన్ని మంగళవారం కువైట్ వైఎస్సార్‌సీపీ కో-కన్వీనరు, కాపు యువనేత మర్రి కల్యాణ్, గ్లోబల్ కన్వీనరు ఆలూరి సాంబశివారెడ్డి, గల్ఫ్ కన్వీనరు బీహెచ్ ఇలియాస్, కువైట్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు, ప్రవాసాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు వీపీ రామచంద్రారెడ్డి ఇక్కడి విలేకర్లకు తెలియజేశారు. ప్రధానంగా గల్ఫ్ సమస్యలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ తరఫున తాము సాధ్యమైనంత వరకు అన్ని విధాలుగా అండగా వుండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గల్ఫ్ బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నో రకాలుగా సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఏపీఎన్‌ఆర్టీ ద్వారా బాధితులకు అండగా నిలిచామన్నారు. అదే తరహాలోనే ఇప్పుడు కూడా కువైట్ వైఎస్సార్‌సీపీ పనిచేస్తోందన్నారు. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారం తీసుకొచ్చేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా వారు కాపు యువతకు రాజకీయంగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ అధినేత సానుకూలంగా స్పందించినట్టు తెలియజేశారు.



వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ కువైట్ కో-కన్వీనరు మర్రి కళ్యాణ్, గల్ఫ్ కన్వీనరు ఇలియాస్



జగన్‌ను కలిసిన ప్రవాసాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా లో ఓల్టేజీ సమస్య కారణంగా ప్రజలు దాదాపు సంవత్సరాల తరబడి ఇబ్బందులు పడుతున్నారని, అలాగే గోవిందంపల్లి, శంకరాపురం దళితవాడ గ్రామంలో విద్యుత్ సమస్యతో ప్రాణాలు పోతున్నాయని.. కాపాడాలని సీపీఐ నాయకులు మంగళవారం విద్యుత్ శాఖ అధికారి బాలాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ మాట్లాడుతూ గ్రామాలల్లోని సింగల్ ఫేజ్ ట్రాన్సు ఫార్మర్లు తొలగించి వాటిని రైతులకు విక్రయించుకున్నారని ఆరోపించారు. దీంతో మండల కేంద్రంలో లో ఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నారని తద్వారా గృహంలోని విద్యుత్ సామగ్రి దెబ్బతిని లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతోందన్నారు. క్రమం తప్పకుండా నెలనెల విద్యుత్ ఛార్జీలు కట్టించుకుంటున్న అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా దళితుల తలరాత మారలేదని, మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాలు ఎక్కడున్నా విద్యుత్ సౌకర్యం సరిగా లేదని, గోవిందంపల్లి పంచాయతీ, శంకరాపురం దళితవాడ గ్రామంలో విద్యుత్ తీగలు చేతికందే స్థాయిలో ఉండటంతో ఇప్పటికే పలువురు గ్రామస్తులు మరణించారని, తరచూ గ్రామస్తులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. ఈనెల 25వ తేదీలోపు సమస్యలను పరిష్కరించకుంటే ఏపీఎస్పీడీసీఎల్ కొర్లకుంట కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి హైవేపై రాస్తారోకో, ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి సుబ్బరాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఏఈ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వేరుశనగ విత్తనకాయలు పంపిణీ

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె ఆర్‌బీకే కార్యాలయం వద్ద మంగళవారం రైతులకు వేరుశనగ విత్తనకాయలను మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజనల్లో పంటలు సాగుచేసే రైతులకు సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'రేణుకా చౌదరి క్షమాపణలు చెప్పాలి'

రాయచోటి జగదాంబ సెంటర్ : వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రేణుకాచౌదరి వెంటనే క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి శ్యాంకుమార్ డిమాండ్ చేశారు. రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై రేణుకాచౌదరి అవివేకంతో మాట్లాడుతుండటాన్ని ఖండించారు. వెంటనే ఆమె వైఎస్ జగన్‌కు క్షమాపణలు చెప్పాలన్నారు. సీఎం చంద్రబాబుకు వత్తాసు పలికితే అభ్యంతరం లేదుకాని తమ నాయకుడిని విమర్శించడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు నవాజ్‌క్రిష్ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలో అభివృద్ధి పథంలో భారత్'

రాజంపేట టౌన్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదకొండు సంవత్సరాల పాలనలో భారతదేశం ఆర్థిక పరిస్థితి నాల్గవ స్థానానికి చేరుకుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. మోదీ పాలన పదకొండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మోదీ చిత్రపటానికి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళుతోందన్నారు. యావత్ ప్రపంచం ఇప్పుడు భారత్ వైపు చూస్తుందని తెలిపారు. 2024-2025 బడ్జెట్‌లో లక్షా ఇరవై ఏడు వేల కోట్లు కేటాయించారన్నారు. రాష్ట్రాలు బలపడేలా మోదీ నిర్ణయాలు తీసుకుంటుండటంతో దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. భారత్‌పై ఉగ్రవాదులు దాడులు చేసిన ప్రతిసారి మోడీ తనదైన శైలిలో పాకిస్తాన్ ఉగ్రవాదులకు బుద్ధి చెబుతున్నారన్నారు. 2047 వికసిత భారత్ మోడీతోనే సాధ్యంకాగలదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, వివి.రమణ, పి.పాపయ్య, వేణుప్రసాద్‌రాజు, గాదెల శ్రీనివాసులు, పెనుగొండ రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

క్రీడలలో యువత రాణించాలి



సాత్వికను అభినందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నందలూరు : యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణియాదవ్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుదీర్‌లు అన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ సబ్ సెంటర్‌లో భారతాల సాత్విక్ చిన్న వయసులోనే బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నందుకు అభినందించారు. భవిష్యత్తులో క్రీడలలో రాణించి మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు. అనంతరం సాత్విక్‌ను క్లబ్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు మోడపోతుల రాము, గురుప్రసాద్, క్రికెట్ సబ్‌సెంటర్ కోచ్ ఫిరోజ్‌ఖాన్, దివ్యాంగుల క్రికెట్ ప్రతినిధి శివకోటి, జంగంశెట్టి హరి, గుండు సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలలో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు

రాజంపేట రూరల్ : పోటీ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటితే వారికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని రాజు హైస్కూల్ సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు, ప్రిన్సిపల్ వాయల్పాటి మోహన్‌రెడ్డిలు తెలిపారు. పదవ తరగతి పరీక్షలలో ఇండ్లూరి రెడ్డి రాహిత్య(596), టంగుటూరి నాగ కార్తీక్(595), గూడూరు నిహారిక(595), ఏకశిరి నవ్యశ్రీ(510)లు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డులు ప్రకటించింది. ఈ అవార్డులను సోమవారం రాయచోటిలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ ఈవెంట్‌లో విద్యార్థులు అందుకున్నారు. స్థానిక రాజు హైస్కూల్‌లో ప్రతిభ అవార్డులు అందుకున్న విద్యార్థులకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. తమ పాఠశాల విద్యార్థులు నలుగురికి అవార్డులు రావటం గర్వకారణమన్నారు.



ప్రతిభా అవార్డులు అందుకున్న రాజు విద్యార్థులు

ఒంటిమిట్టకు చేరిన యూరియా

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట రైతు భరోసా కేంద్రానికి మంగళవారం యూరియా చేరింది. మండల పరిధిలోని పెన్నపేరూరు రైతు భరోసా కేంద్రానికి 10 టన్నులు, గంగపేరూరు రైతు భరోసా కేంద్రానికి 9 టన్నులు, ఒంటిమిట్ట రైతు భరోసా కేంద్రానికి 19 టన్నులు యూరియా మూటలు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. మండలానికి 60 టన్నులు యూరియా రావాల్సి ఉండగా ప్రస్తుతం 38 టన్నులు యూరియా మాత్రమే వచ్చిందన్నారు. ఒక్కొక్క యూరియా మూట రూ. 257.50 విలువ చేస్తుందని తెలిపారు. పూర్తిస్థాయిలో యూరియా మండలానికి చేరిన తరువాత రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఏఓ పేర్కొన్నారు.

యానిమేటర్‌ను కొనసాగించాలంటూ మహిళల నిరసన

సిద్దవటం : నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా సీసీ ప్రవర్తించడం తగదని మాధవరం-1 డ్వాక్రా సంఘాల సభ్యులు అన్నారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామంలో మంగళవారం డ్వాక్రా సంఘాల మహిళలు మాట్లాడుతూ తమ గ్రామానికి యానిమేటర్‌గా పనిచేస్తున్న సులోచన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడేవరన్నారు. అప్పట్లో సంబంధించిన అధికారులు విధించిన పనులను నిర్వర్తించడంలో ఆమె అనారోగ్యం కారణంగా పనులు చేయలేకపోయారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. కాగా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత సీసీ ఆమె పట్ల కక్ష కట్టి ఆమెను తప్పించాలన్న ఉద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి నడుచుకున్నారన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యకరంగా ఉన్నప్పటికీ, తమ విధులను నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ సీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఆమెను ఉద్దేశ పూర్వకంగా విధుల నుంచి తప్పించాలని చూస్తున్న సీసీ తీరుకు వ్యతిరేకంగా డ్వాక్రా సంఘాల సభ్యులు నిరసన ప్రదర్శన చేశారు.



నిరసన తెలుపుతున్న డ్వాక్రా సంఘాల సభ్యులు

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ముదిరాజ్ సంఘం ఉభయ దాతలుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ జిలకల సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మలు తెలిపారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. అలాగే నారాయణ హోమం వేదపండితులచే జరిపించాది. మంగళవారం రాత్రి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కల్యాణం..

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం కొనేని వారు ఉభయదాతలుగా వేణుగోపాలస్వామి రుక్మిణి సత్యభామల రుక్మిణి సత్యభామల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేణుగోపాలస్వామికి మాజీ స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు విజయ్ రెడ్డిలు ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.



విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయం

వైభవంగా ముగిసిన నాగారపమ్మ జాతర

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లె గ్రామంలో వెలసిన నాగారపమ్మ జాతర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలం నుంచే కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మొక్కులు తీర్చుకొని ముడుపులు చెల్లించారు. చాందినీబండ్లు, చెక్కభజనలు, కోలాటాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



తిరునాలలో పాల్గొన్న భక్తులు

ఎస్సీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

కడప రూరల్ : ప్రభుత్వం ఎస్సీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు.

రాజంపేటలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

రాజంపేట : వర్షాకాలం ముందస్తుగా రాజంపేట పట్టణంలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని మున్సిపాలిటి కమిషనరు జి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల సమయంలో నీటి ప్రవాహం వల్ల ట్రాఫిక్ అడ్డంకి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నీటి నిల్వలు, మురుగునిల్వలు నిల్వ లేకుండా ప్రవహించేలా ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. మురుగు కాల్వలో చెత్తాచెదారాలు లేకుండా తీసివేయాలన్నారు. పట్టణ పరిధిలో భారీ డ్రైనేజీలలో మురుగు నీటి ప్రవాహం యథేచ్ఛగా తరలించేలా చర్యలు తీసుకుంటుమన్నారు. మురుగు నీటి కాల్వలలో చెత్తా చెదారాలను వేయరాదన్నారు. ఈ విషయంలో పట్టణవాసులు మున్సిపాలిటీకి సహకరించాలన్నారు. ఈయనతోపాటు ఆయా సచివాలయాల శ్యానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

పుల్లంపేట : కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చిన వాటిని రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు మండల సమన్వయ కమిటీ సమావేశం ఎస్.శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని పన్నెండు గంటలకు పెంచడం, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం 8 గంటల పనిని 10 గంటలకు పెంచి క్యాబినెట్ తీర్మానించడం దుర్మార్గమన్నారు. కనీస వేతనాలు చట్టం పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ లాంటి హక్కులు కోల్పోతారన్నారు. స్కీమ్ వర్కర్లకు, అంగన్‌వాడీ, యానిమేటర్స్, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి వారికి గౌరవ వేతనం పేరుతో వెట్టిచాకిరి చేస్తున్నారని విమర్శించారు. జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఎర్రనేలలో నూనె గింజల సాగు లాభదాయకం

లక్కిరెడ్డిపల్లి : ఎర్రనేలలో వేరుశనగ కాకుండా నూనె గింజల సాగు రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని శాస్త్రవేత్త సురేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బి ఎర్రగుడి, కోనంపేట గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సురేష్ మాట్లాడుతూ వేసవిలో తొలకరి చినుకులలో లోతు దుక్కులు చేసుకోవాలని వారు సూచించారు. ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ సాగు చేస్తూ ఉంటారని, అలా కాకుండా ఎర్రనేలలో ఆముదం, ప్రొద్దుతిరుగుడు వంటి పంటలు సాగు చేసుకోవడంతో మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం ఉద్యానవన కళాశాల అధ్యక్షురాలు ముకుంద లక్ష్మి మాట్లాడుతూ మామిడిలో పంటకోత అనంతరం సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులు పంట దిగుబడి అధికంగా పొందవచ్చన్నారు. మామిడిలో పిందె దశలోనే రైతులు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవడంతో పండు ఈగ నుంచి బయటపడవచ్చన్నారు. మార్కెట్‌లో బుట్ట ధర రూ. 3.30లతో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఊటుకూరు డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ డ్రోన్ ధర రైతుకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతుకు ఒక్కొక్క డ్రోన్ రూ. 2 లక్షలకే అందజేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అనంతరం కెవి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారానే ప్రభుత్వ పథకాలు అందజేస్తుందని, ఈ విషయాన్ని రైతులు గమనించి ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అనూష, కెరోలిన్, వీహెచ్‌ఏలు పావనీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సురేష్

విచ్చలవిడిగా ఉన్న బెల్టుషాపులను తొలగించండి


ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా బెల్టు షాపులు ఉండటంతో మద్యం ఏరులై పారుతోందని, దీంతో నిరుపేద కడుపు కొడుతున్నారని బికెఎంయు నాయకులు ఆరోపించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపుమేరకు నిరుపేదల సమస్యలపై ఉపాధి హామీ పథకం చేస్తున్న కూలీలు సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మూడు దశాబ్దాలు గడుస్తున్నా కూలీలకు ఒరిగిందేమి లేదన్నారు. ఏడాదికి 13 సార్లు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను పెంచి పేదవాడి నడ్డి విరగగొడుతున్నారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. జాతీయ ఉపాధి హామీ కూలీలకు కొలతలతో పనిలేకుండా ప్రస్తుతం ఉన్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని రూ.700లకు పెంచాలన్నారు. ఏడాదిలో 250 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు.అలానే గ్రామీణ ప్రాంతాలలో బెల్టు షాపులను ఎత్తివేయాలని లేకుంటే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) ఆధ్వర్యంలో గ్రామీణ కష్టజీవుల పల్లెబాట కార్యక్రమం చేపట్టి రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నిరుపేదలు ద్వారా గట్టిగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య, ఓబులవారిపల్లి మండల అధ్యక్షులు కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సిద్దవటం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా పోలీసు సాయి మానస తెలిపారు. సిద్దవటం మండలంలోని గొల్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం (పిసిఎంఏ-2006) ప్రకారం మహిళలకు కనీస వివాహ వయస్సు18 ఏళ్లు కాగా, పురుషులకు 21 సంవత్సరాలు ఉండాలన్నారు. ఈ చట్టం బాల్య వివాహాలు చేస్తే 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, లేదా లక్ష రూపాయలు జరిమానా లేదా రెండు విధించవచ్చన్నారు. బాల్య వివాహాలు జరిపిన లేదా నిర్వహించిన వారికి కూడా ఈ శిక్ష వర్తిస్తుందని తెలియజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు జరగడం వల్ల ఆడపిల్లలు అనారోగ్యం పాలవుతారన్నారు. బాల్య వివాహాల వల్ల చాలామటుకు వారి చదువు ఆగిపోవడం, లేదా అర్థవంతమైన పని లేకపోవడం వలన పేదరికాన్ని అనుభవించవలసి వస్తుందన్నారు. లేత వయస్సులో వివాహాలు చేయడం వల్ల కాన్పులు కష్టం కావడం వల్ల ప్రసూతి మరణాలు, శిశు మరణాలు అధిక శాతంలో సంభవిస్తాయని ఆమె పేర్కొన్నారు.

స్కౌటిజంతో మెరుగైన సమాజం

రాజంపేట టౌన్ : స్కౌటిజంతో మెరుగైన సమాజం సాధ్యం కాగలదని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ముగిసిన తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ శిక్షణా కార్యక్రమానికి మడితాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచి క్రమశిణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం తోడ్పడుతుందని తెలిపారు. సోపాన్, రాజ్యపురస్కార్ శిక్షణ వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, నిజాయితీ, సుగుణశీలత, ధైర్యసాహసాలు, సేవాగుణం వంటి ఉత్తమ పౌరసత్వ లక్షణాలు అలవడతాయన్నారు. స్కౌట్ శిక్షణ పొంది సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. అందువల్ల ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్ మాట్లాడుతూ సోపాన్ శిక్షణకు 92 మంది, రాజ్యపురస్కార్ శిక్షణకు 12 మంది గైడ్స్ విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ శిక్షణలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నైతిక, మానవతా విలువలు, దేశభక్తి, సేవాభావం, గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల సందర్భంగా స్వచ్ఛందంగా సేవలు అందించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయలక్ష్మి, గైడ్స్ లీడర్, ట్రైనర్ శకుంతల, హెచ్‌డబ్ల్యూబి నిర్మల, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు శివలీల, కనకదుర్గ, సుజాత, బేసిక్ గైడ్ కెప్టెన్లు గోవిందమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మడితాటి నరసింహారెడ్డి